పెద్ద కథ :

# తియ్యని సాయంత్రాలూ వెన్నెల రాత్రులూ*

## శ్రీ మురళీధర్

'తియ్యని సాయంత్రాలూ— వెన్నెల రాత్రులూ' అని రాశాడు రమాకాంత్ తన దగ్గర మిగిలిన చివరి కాగితం మీద.

గబగబా బజారుకు వెళ్ళి మరోదస్తా కాగితాలు తీస్కొచ్చాడు రమాకాంత్. ఉద్వేగంతో రాసుకు పోతున్నాడు. . . .

. . . సుశీల ఇల్లు విడిచి వెళ్ళిపోయింది ! ఏ మాత్రం లెక్క చెయ్యకుండా. తన కోసం ఏమి చెయ్యడానికేనా సిద్ధంగా ఉండే శ్యామసుందర్‌ని వదలి వెళ్ళిపోయింది ! ఇంతకీ సుశీల ఎక్కడికి వెళ్ళిపోయినట్లు ? వెళ్ళేటప్పుడు కథల్లో లాగ ఒక ఉత్తరమైనా రాసిపెట్టి పోతే బాగుండును ? తెలిసేది శ్యామసుందర్‌కి. తెలిసొచ్చేది శ్యామసుందర్‌కి ఒక రకంగా. అయినా శ్యామసుందర్‌కీ సుశీలకీ మధ్య ఎంత ప్రేమ ఉంది ? అబ్బ ! వాళ్లిద్దరి దాంపత్య జీవితం ఎంత మంది మిత్రులకి ఆదర్శంగా తయారైంది ? ఎంత మంది నిజంగా వీళ్ళిద్దరినీ మనస్సులో అభినందించి, తాము కూడా జీవితంలోని సుఖాన్ని కొల్లగొట్టుకుందామనుకున్నారు ? వాళ్ళందరి ఆశలు ఏం కాను ? అయినా వాళ్ళ బ్రతుకుల కోసం, వీళ్ళు ఎందుకు తాపత్రయ పడతారని ?. . . . .

రాస్తూ రాస్తూన్న రమాకాంత్‌కి వెళ్ళిపోతూన్న రమ కనిపించింది.

'రమా'

'ఓ రమా'

'ఏయ్ రమా'

'నిన్నే'

అబ్బే ! వినిపించుకున్నట్లు లేదు. రమ అప్పుడికప్పుడే మెట్లు దిగి పోయింది.

రమాకాంత్ రాయటం మానేసి సిగరెట్టు ముట్టించాడు చవకబారుగా భావాల కోసమా అన్నట్లుగా. . .

సిగరెట్టయితే కాలిపోయింది. బూడిద మిగిలిపోయింది ఏష్ ట్రేలో.

'గబగబా వెళ్ళి రమను పిలుస్తేనో ? అమ్మయ్యో, రాస్తున్న కథ ఆగిపోతుంది. థాట్ లింక్ తెగిపోతుంది. సుశీల

### ఈ పెద్దకథను గూర్చి ఒక్క మాట

ఇది ఒక రకంగా చెప్పాలంటే ఒక ప్రయోగం— కథ చెప్పే పద్ధతిలో.

జీవితమూ, రచనా— ఈ రెండూ ఒకదాన్నొకటి ముందుకు తీసుకు పోవాలి— అవి చైతన్యవంతమైనవైతే. సమగ్రమైన జీవితానికి పునాది వెయ్యగలది సమగ్రమైన రచన !

కథలో తేల్చ గలిగిన సమస్య మరి రచయిత రమాకాంత్‌కు జీవితంలోనే ఎదురైనప్పుడు ఏమి చెయ్యగలిగాడూ అన్నదొకటే . . . . . . .

చెప్పే పద్ధతిలో ఒక మెలిక !

కథ రాస్తూ ఉంటాడు రచయిత రమాకాంత్. మధ్యలో తన జీవితం వచ్చి కలాన్ని పక్కకు నెట్టేస్తుంది. కథ అక్కడికి ఆగుతుంది.

జీవిత కథ మొదలౌతుంది. మళ్ళాకథ. . . ఈ విధంగా మెలిదిరిగి ఒక దాని వెంట ఒకటి, ఒకప్పుడు ఏదీ ముందో ఏది వెనకో తెలియకుండానూ సాగుతుంది.

మరికాస్త ఓపిక అవసరం పాఠకుడికి !

—రచయిత.

ఆ పరిస్థితుల్లో ఏం చేస్తుందో తన కొక నిశ్చితమైన అభిప్రాయం రాబోతోంది. అప్పుడు శ్యామసుందర్ ఏం చెయ్యాలో అతనికి ఇప్పుడిప్పుడే తడుతోంది. అందువల్ల ఇప్పుడే వెళ్ళిపో కూడదు. ఇప్పుడు గనక తను లేచాడో నిర్మిస్తూన్న కథావస్తువు పోతుంది.

రమ ఎందుకు వెళ్ళిపోయిందో, అంత తొందరగా ? మర్చిపోయా, ఇవాళ కొత్త పిక్చర్ సరస్వతీ హాలులో రిలీజ్ అవుతోంది వెడదాం రమ్మంది కదూ ?

వెడితేనో ?

అమ్మో ? కథలో లింక్ తెగిపోదూ ? ఈ సిట్యుయేషన్‌లో సుశీల ఏం చేస్తుందో ?

సరే కథ పూర్తి చెయ్యాలి ? అవును— సుశీల శ్యామసుందర్ ఒకళ్ళ నొకళ్ళు అంత బలంగా. . . గాఢంగా. . . . . పాత మాటలు ? పాత ప్రేమ ?

ఏది పాతది ? ఏది క్రొత్తది ? ఆ నాడు దుష్యంతుడు శకుంతలను చూసినప్పుడు కలిగింది పాత ప్రేమానూ, ఇటు బీచిలో కలిస్తే కొత్త ప్రేమా అయి ఊరుకుంటుందా ?

ఎందుకీ చర్చ ? కథ రాయటం పడక ! రమవెళ్ళింది గనక ! తను కథరాస్తూన్నా దులపరించుకుని వెళ్ళిపోయింది గనక !

కాదు. . . కాదే. . . . రమ అట్లాంటిది కాదే ? ఇప్పుడు తను రాయబోయేదీ, రాస్తున్నదీ సుశీలను గూర్చిగా?

సరే మరి. . . అయినా సుశీలను గూర్చి రాస్తూంటే రమవచ్చి నిల్చుంటోంది. ఎంత పొమ్మన్నా పోవటం లేదు.

'సరే. . . కళ్ళు మూసుకుంటాను. . . కాస్సేపు. . . .'

రమాకాంత్ కళ్ళు మూసుకున్నా. కళ్ళకు కట్టినట్లు కనిపించింది. తనూ— రమా—రమా— తనూ— బీచీ —షికారూ— బట్టలషాపూ— షిఫాను చీరా— సెరిలిన్ చొక్కా —మాసిపోని చిరునవ్వు— పాలకోవాలాంటి ముద్దు— మత్తు — నిషా. . . .

కళ్ళు తెరచాడు. రమాకాంత్ రాయటం మొదలెట్టాడు—తెల్లటి కాగితాల మీద నల్లని అక్షరాలని.

. . . . ఇంటికి వచ్చి చూసుకునేసరికి ఇల్లు ఖాళీగా ఉంది. ఇంట్లో సుశీల లేదు. అందుకే ఇల్లు ఖాళీగా ఉంది. వళ్ళు బరువుగా ఉంది. ఏం కావాలి శ్యామసుందర్ ?

శ్యామసుందర్‌కు ఎందుకో అనుమానం వేసింది. సుశీలకు తనకూ మధ్య ఎందుకింత అగాధం ? ఏమిటి ఈ విధంగా అయిపోయింది జీవితం ? కళ్ళ ముందర కట్టుకుంటూన్న స్వర్గం ఎందుకీవిధంగా కూలిపోయింది ?

సుశీల కోసం తను బయలుదేరి వెళ్ళాలో అక్కర్లేదో శ్యామసుందర్‌కు అర్థం కాలేదు. అయినా ఎక్కడికి వెళ్ళి ఉంటుందని తను వెళ్ళి వెదకటానికి ? తప్పు ఎవరిదైనా నచ్చజెప్పి తీసుకు రావడానికి ? కాస్త చెప్పి వెడితే ఏమయ్యేదీ ?. . . తన్ను వెళ్ళనిచ్చే వాడా ? ఏమో ? వెళ్ళే వాళ్ళని పట్టుకుంటే మాత్రం ఆగుతారా ? ఆగిపోవచ్చును గూడాను. ఎంతో మంది నూతిలో పడబోతూ ఆగిపోయారు, ఎవరో ఆ క్షణంలో పట్టుకోబట్టి ? . . . అందుకే చెప్పకుండా వెళ్ళి పోయిందేమో సుశీల ?. . . .

. . . రమాకాంత్ మరో సిగరెట్టు వెలిగించాడు ఏమి రాయాలో తోచక. ఎదురుగా హోటలు నుంచి కాస్త కాఫీ తెప్పించుకుని తాగాడు.

రమ తన ఫ్రెండ్ ఉమతో సరస్వతీ ప్యాలెస్‌లో ఆ రోజె రిలీజ్ అవుతున్న కొత్త పిక్చర్‌కు వెళ్ళింది. రమాకంత్‌ను రమ్మంది. అసలు ఉమ కలకత్తా నుంచి వచ్చింది, సంక్రాంతి పండక్కి. ఉమ భర్త కలకత్తాలో ఇంజనీరుగా పని చేస్తున్నాడు. అతనికి రావడానికి తీరికలేక, మరీ మనసుపడుతోందని ఉమను పంపించాడు పండగకు. ఉమా రమా ఒకే కాలేజీలో చదువుకుని చిన్నప్పటి నుంచీ చనువుగా ఉండటం వల్ల ఇద్దరికీ అంతరాలు లేని స్నేహం. ఒక ఏడాది వ్యవధిలో ఇద్దరికీ పెళ్ళయింది. ముందరగా ఉమ పెళ్ళిచేసుకుని కలకత్తా వెళ్ళిపోయింది. రమకు వీలుగా విశాఖపట్టణంలోనే కాల్‌టెక్స్‌లో పని చేస్తూన్న రమాకాంత్‌తో పెళ్ళి కావటంతో ఊరు విడిచి వెళ్ళవలసి వస్తుందన్న బెంగ పోయింది.

ఉమ పెళ్ళి అయిన తర్వాత, అత్తవారింటికి కలకత్తా వెళ్ళిపోతూంటే రమకు ఏదో అనిపించింది— తను కూడా అదే విధంగా అందరినీ వదిలి మరో రోజున మరో ఊరు వెళ్ళిపోవలసి వస్తుందని, కాని అట్లా జరగలేదు. రమాకాంత్‌ని భర్తగా పొంద గలిగినందుకు రమని చూసి చాలా మంది అసూయ పడ్డారు. 'ఏకేం, మీ ఆయన అయిదొందలు సంపాదిస్తున్నాడు. అది గాక రచయిత కూడను. . .' నిజంగా పొంగి పోయింది రమ. తనను అదృష్టం వరించి వచ్చిందని మురిసి పోయింది. రమాకాంత్ జీవితాన్ని తియ్యని రుచులతో నింపింది. అటు కలకత్తాలో ఉమ తన జీవితం చాలా హాయిగా గడిచి పోతున్నట్లు ఉత్తరాలు రాస్తూ ఉండేది. క్లబ్బులూ, వినోదాలతో నిండిపోయి ఎంతో ముచ్చటగా ఉంటున్నట్లూ, ఆ విధంగా ఉండలేక పోయిన రమని చూసి జాలిపడుతూ ఉత్తరాలు దొర్లిస్తూ

ఉండేది. రమ వైఖరిలో మార్పు రావటం రమాకాంత్ కని పెట్టాడు. అర్థంకాని నిస్సహాయ స్థితిలో పడ్డాడు.

. . . శ్యామసుందర్ సుశీల కోసం బయలు దేరాడు. ఎక్కడకు వెళ్ళినట్లు ? ఎక్కడకు వెళ్ళినా ఈపాటికి వచ్చేసి ఉండాలే ? తన మీద కోపంతో వెళ్ళిపోయి ఏమైనా అఘాయిత్యం చేసుకోలేదు గదా ? ఒక్కసారి కళ్ళ ముందరికి రైలు పట్టాలూ, ఊరుకు మూడు వైపులా ఉండి వివక్షత లేకుండా ఆహ్వానించే సముద్రం వచ్చాయి. . . ఛా. . . సుశీల అట్లా చెయ్యదే ? సుశీలకి జీవితం మీద ఆశ ఉంది. నమ్మకం ఉంది. బ్రతక దల్చుకున్న వాళ్ళను ఏదీ చంపలేదు. చావ దల్చుకున్న వాళ్ళను ఏదీ బ్రతికించలేదు. మొదటి తరహా మనస్తత్వం గల వాళ్ళకు జీవితంలో బ్రతకడానికి ఏదో ఒక అసరా కనిపిస్తూనే ఉంటుంది. రెండవ తరహా వాళ్ళకి ఏ మామూలు కారణమైనా చాలు జీవితాన్ని త్యజించడానికి. అందువల్ల, సుశీల అటువంటి పనేవీ చేసి ఉండదు. బహుశః తన స్నేహితురాలు సుమిత్ర దగ్గరికి వెళ్ళి ఉండవచ్చు. సుమిత్రా సుశీలా ఇద్దరూ ఒకే ప్రాణంగా మెలిగే ఇద్దరు వ్యక్తులు మరి. ఇద్దరి మధ్యా దాపరికం అనేదే లేదు. సుమిత్ర ఇంటికి వెడితేనో ? బాగుంటుంది ?' 'మీ ఇంటికి మా ఆవిడ వచ్చిందా' అని అడిగితే ఏమి బాగుంటుంది ? బయట పడిపోతానని కొంచెం జంకాడు శ్యామసుందర్. సుమిత్ర వెంటనే సాగదీసి నాలుగు ప్రశ్నలు వేస్తే ? తను సమాధానం చెప్పలేక పోతే ? అయినా సుమిత్ర కేమిపని తన ఇంటి సంగతులు అడిగేందుకు ? ఏమో ? అడిగితే ఒక వేళ ? తామిద్దరూ ఘర్షణ పడ్డట్లు చెప్పడమా ? మానటమా ? సుశీల ఈ పాటికే చెప్పకుండా ఉంటుందని ఏమిటి భరోసా ?. . .

రమాకాంత్ రాస్తూన్న కథాగమనం కుంటు పడింది. తనను గూర్చిన ఆలోచన పెరిగింది. రమ రోజుకు రోజు ఈ విధంగా ఎందుకు మారి పోతోంది ? నిజంగా ఎంత మురిసి పోయాడు తను ? రమ బాగా చదువుకున్నదీ, కమ్మగా పాడగల దీను. కాలేజీలో చాలా ప్రయిజులు కూడా వచ్చాయి రమకు. ఎంతో అండగా నిలుస్తుందనీ, భావి జీవితంలో ప్రతి రోజూ కొత్త ఆశలతో చిగిర్చి కొత్త కోర్కెల పూలుపూసి గుబాళిస్తుం దనుకున్నాడు.

కాని. . . ఏమిటి రమకి తనంటే అంత నిర్లక్ష్యం ? ఏమనుకుంటోంది తనకి తాను ? ఏమిటి ఆ అతిశయం ? ఎందుకంత గర్వం ? అది మనిషి పెరగడానికి నిదర్శనం కాదే ? ఇంత చదువుకున్నదీ భర్తను సుఖపెట్టడానికి కాదూ ? లేక పోతే మరిదేనికీ ?

ఈ ప్రశ్నే గనక రమాకాంత్ రమను అడుగుతే 'మీ చదువూ, రచనా అంతా ఊళ్ళో వాళ్ళ కోసమా ?' అంటుంది.

అంటుందేమిటి ? అన్నది కూడాను, ఆ అర్థం స్ఫురించే లాగ అనేకసార్లు.

రమాకాంత్‌కి సహనం తగ్గిపోయింది. తన మీద తనకి కోపం పెరిగి పోయింది. మాటి మాటికీ చెదిరి పోతూన్న మనసు కళ్ళేన్ని పట్టుకోవడానికి ప్రయత్నం చెయ్యటంలో మరీ మరీ అలసి పోయాడు.

ఉన్నట్టుండి రమాకాంత్‌కు ఏదో అనిపించింది. ఇప్పుడు రమ ఏమి చేస్తూ ఉంటుంది ? ఉమతో పిక్చర్ చూస్తూ ఉంటుంది సరస్వతీ పిక్చర్ ప్యాలెస్‌లో. అది మధురమైన ఘటం కావచ్చు. ప్రేయసికి ప్రియుడు కృతిమ చందమామను చూపిస్తూ స్టూడియో వనంలో విహరిస్తూ ఉండొచ్చు. రమకు ఏద జ్ఞాపకాని కొచ్చి ఒక్కసారి మనస్సు చలించి ఉండచ్చు. తను పక్కన ఉండి ఉంటే ?. . . ఉందిగా ఉమ ? తను కూడా వెళ్ళి ఉంటే ? అవును వెళ్ళి ఉంటే ?. . . ఎంతో బాగుండి ఉండేది ? కాని అట్లా జరగలేదుగా ?

కథ పూర్తి చేసి. . . అవును, కథ పూర్తి చేసేసి. . . . అప్పటికల్లా సినిమా వదిలిపెట్టే వేళ కూడా అవుతుంది. రమాకాంత్‌ను చూపి ఉమ తప్పుకుంటుంది గనక, తను రమతో కలిసి ఒకే రిక్షాలో ఇంటికి వచ్చెయ్యచ్చును. దారిలో నచ్చ జెప్ప వచ్చు కూడాను. అప్పుడు రమ 'ఏదండీ ఆ కథ నన్ను చదవ నియ్యరూ మొదట' అని మారాం చేస్తుంది. అవును అందుకే కథ పూర్తి చెయ్యాలి తొందరగా.

. . . సుమిత్ర ఇంటికి శ్యామసుందర్ వెళ్ళేసరికి బాగా చీకటి పడింది. ఆ సమయంలో ఒంటరిగా ఉంటూన్న స్త్రీ ఇంటికి ఎవరైనా రావడం చూస్తే ఆశ్చర్యం కనబర్చటం ఎంతైనా సహజం.

శ్యామ్‌సుందర్‌కి ఈ విషయం తెలుసు గనకే గబగబా లోపలికి వెళ్ళలేదు. అదిగాకుండా తను వెళ్ళేసరికి సుశీలా సుమిత్రా కలిసి ఏమన్నా మాట్లాడుకుంటున్నారేమో విందామన్న కోరిక కలిగింది శ్యామసుందర్‌కి. అది మంచిదో చెడ్డదో ఆలోచించే వ్యవధే ఉంటే ఆ ఆలోచనే కలగదు ! ఇద్దరూ తనను గూర్చి తర్జన భర్జన పడుతూ ఉండాలి. మెల్లిగా పిల్లిలాగ చప్పుడు చెయ్యకుండా వినాలి.

శ్యామసుందర్ వాకిటి గుమ్మంలోంచి వెళ్ళకుండా ప్రక్క కిటికీ దగ్గర నిల్చున్నాడు. లోపల్నుంచి ఏమీ మాటలు వినపడటం లేదు. 'ఎవ్వరూ లేరేమో ?' అయినా లోపలికి వెళ్ళి

చూస్తేనో ? అవును. అదే మంచిది. ఇంత దూరమూ వచ్చి ఇంట్లోకి వెళ్ళకుండా ఏమిటి ?. . .

శ్యామసుందర్ గబగబా వీధి తలుపు దగ్గరకు వచ్చాడు. ఆ తొందరలో కాలుజారి పడ్డాడు. ఈ గడబిడకి తలుపు తీసి సుమిత్ర బయటకు వచ్చింది.

'మీరా !'

'మెట్టెక్కుతూంటే కాలుజారింది'

'దెబ్బ అయితే తగల్లేదు కదా ?'

'ఓ మాదిరిగా. . . .'

'ఇంత రాత్రివేళ ఇట్లా వచ్చారేమిటి సంగతి ?'

'లోపలికి రమ్మంటారా ?,

'క్షమించాలి, నిలుచోబెట్టి మాట్లాడినందుకు. రండి. లోపలికి రండి.'

గదిలోకి వెడుతూ, నాలుగు వైపులా చూశాడు శ్యామసుందర్. ఏ గోడచాటునో, తలుపుచాటునో, ఏదో చిరుత పులి దాక్కుని మీదకు దూకుతుందేమో అన్నంత భయం వేసింది ఎందుకో అతనికి !

తను కిటికీ దగ్గర నిల్చున్నట్లు సుమిత్ర చూసిందేమో? సుశీల కూడా లోపలే ఉండి నాటకం ఆడుతోందేమో ? ఎట్లా తెలుస్తుంది ?

ఏమని అడగటం ? ఎట్లా అడగటం ?

తప్పదు. వచ్చిన పని అదేగా ?

సుమిత్ర శ్యామసుందర్ పక్కగా కూర్చుంది. ఎదురుగా కూర్చోలేదు. ఎదురుగా కూర్చుని ఉంటే సూటిగా ప్రశ్న అడగటం కష్టం .

'చూడండి. . . . . . . .'

'ఆ. . . . . . . . . చెప్పండి'

'సుశీల ఇక్కడకు వచ్చిందా ?'

'ఎప్పుడు ?'

'ఇవాళ. . . . చీకటి పడిం తర్వాత. . . .'

'ఇక్కడి కెందుకొస్తుంది, ఈ వేళప్పుడు ?'

'రాలేదన్నమాట'

'మీకు 'అవును' 'కాదు' అనే సమాధానమే కావాలా ?'

'మీరు ఏమి సమాధానం చెప్పాలో నేనెలా చెప్పను ?'

శ్యామసుందర్ కొంచెం తేరుకున్నాడు. మెలికతో మాట్లాడ గలుగుతున్నాడు. సన్నగా నవ్వాడు కూడాను— ఎదటి వాళ్ళ మనస్సు అర్థమైందని సూచించేటట్లుగా.

'పోనీ మీకేం సమాధానం కావాలో చెప్పండి ?' అంది సుమిత్ర చమత్కారంగా.

ఇట్లా కాస్సేపు— కాస్సేపేమిటి రాత్రంతా కబుర్లు చెప్పేద్దామనిపించింది శ్యామసుందర్‌కు. ఒకప్పుడు సుశీలతో మాట్లాడుతున్నా అదే విధంగా అనిపించేది. మరి ఇప్పుడో ?

'పోనీలెండి. నేనే చెప్తాను. సుశీల. . . ఇవ్వాళ. . . సాయంత్రం రాలేదండి.'

'మీరు చాలా గడుసువారండీ'

శ్యామసుందర్ కోపం కొంచెం తగ్గింది. కాని తను వచ్చిన పని ఏమిటి ? సుమిత్ర దగ్గరకు సుశీల వచ్చిందా ? వచ్చి ఏం చెప్పిందో ? ఇది శ్యామసుందర్‌కు చాలా అవసరం. దాన్ని బట్టి సుశీల ఏమి తలపెట్టి ఇల్లు విడిచి వెళ్ళిందో తెలుసుకోవాలి. అప్పుడుగాని, తర్వాత ఏమి చెయ్యవలసిందీ తెలియదు.

శ్యామసుందర్ గొంతు సవరించుకున్నాడు. అటూ ఇటూ చూశాడు, ఆ గదిలో వాళ్ళిద్దరూ తప్ప మరెవ్వరూ లేరని తెలిసినా.

'మీకు అభ్యంతరం లేకపోతే ఒక్క ప్రశ్నకు సమాధానం చెబుతారా ?'

'ప్రశ్న మీరు చెబితేనే గాని, నాకు అభ్యంతరం ఉన్నదీ లేనిదీ ఎట్లా చెప్పటం ?'

'మీతో చిక్కొచ్చిందే ?'

'నిజంగా ?'

తర్వాత ఏమి మాట్లాడాలో తోచలేదు శ్యామసుందర్‌కు. సుమిత్ర దగ్గరకు సుశీల వచ్చి ఉంటుందన్నది నిజం. వచ్చి అన్ని సంగతులూ చెప్పేసే ఉంటుంది. సుశీలకు సుమిత్రకన్న ఆప్తు లెవ్వరూ లేరు నిజానికి.

తొందరపడి అడిగెయ్యటమా ? అడక్కుండా వచ్చిన దారినే వెళ్ళిపోవడమా ? అదే గనక ఏ సాయంత్రమో అయితే అట్లాగే చేసి ఉండచ్చు. అది రాత్రి అయ్యె ? అందులో తను అడగనే అడిగేశాడు 'సుశీల వచ్చిందా' అని. అక్కడతో దాన్ని వదిలేసి వెళ్ళిపోతే ? 'మంచిదండి. వస్తాను. ఇక్కడికి వచ్చిందేమోనని అడిగాను. ఇహి హి హి. . .' అని వెకిలినవ్వు నవ్వి వెళ్ళిపోవచ్చు'

అదే మంచిదిగా తోచింది శ్యామసుందర్‌కు. తన కొచ్చిన ఆలోచన చాలా ప్రాక్టికల్‌గా కనిపించింది.

'మంచిదండి. వస్తాను. ఇక్కడికి వచ్చిందేమోనని అడిగాను. ఇహి హి హి. . .' అని వెకిలి నవ్వు నవ్వి మెట్లుదిగాడు.

తన వెనకాలే 'ధన్'మని తలుపు వేసేసుకుంటుం దను కున్నాడు శ్యామసుందర్.

కాని అట్లా జరగలేదు. కుర్చీలోంచి సుమిత్ర కదల లేదు.

ఆఖరి మెట్టు దిగబోతూ ఆశగా వెనక్కు చూశాడు శ్యామసుందర్ తన్నెవరో పిలిచినట్లు. ఆఖరీమెట్టు దిగాడు.

'చూడండి. . . .' వెనక నుంచి పిలుపు. స్త్రీ కంఠం. అది సుమిత్ర కంఠం.

శ్యామసుందర్ ప్రాణం కుదుట పడింది. గిరుక్కున వెనక్కు తిరిగాడు. అన్ని మెట్లూ ఎక్కాడు. పిలవకుండానే లోప లికి వెళ్లాడు. ఇందాక కూర్చున్న కుర్చీమీదే మళ్ళా కూర్చు న్నాడు.

సుమిత్ర ఏం చెప్పినా వినాలనిపించింది. ఏమీ లేని తనం లోంచి అన్నీ ఉన్నతనంలోకి వచ్చినట్లయింది.

సుమిత్ర శ్యామసుందర్ అనుకున్నట్లు గోడవైపు చూసి తనవైపు మాట్లాడలేదు. తనవైపే సూటిగా చూసి తనతోనే మాట్లాడింది.

'మీరు చదువుకున్న వారుగదా, మీరే ఇట్లా ఎందుకు చేశారు ?' అంది సుమిత్ర.

ఒకటి రెండు నిముషాలదాకా సమాధానం చెప్పలేదు శ్యామసుందర్. మొట్ట మొదట సుమిత్ర మనిషిని గూర్చీ, మంచిదనాన్ని గూర్చీ, దాంపత్యాన్ని గూర్చీ సుదీర్ఘోపన్యాసం ఇస్తుందనుకున్నాడు ఉపోద్ఘాతంగా. అట్లా చెయ్యకుండా, నాలుగువందల నలభై పేజీల నవలలో, రెండువందల పదకొండో పేజీలో, సడెన్‌గా, హీరోయిన్ మాట్లాడిన డైలాగులాగ అడిగేసింది.

'కథ మధ్య నుంచి మొదలెట్టారు మీరు'

'నా ప్రశ్న కది సమాధానం కాదు.'

'మీరు నన్నడగటం కాదు, నేనే మిమ్మల్ని అడుగుదామని వచ్చాను.'

'మరి అడగరేం ?'

'అడిగిన దానికి మీరు సరిగ్గా సమాధానం చెప్తారు గనకనా ?'

'పోనీ నే నడిగే హాట కు మీరు చెప్పండి'

చిక్కులో పడ్డాడు శ్యామసుందర్.

'ఊఁ. . . కానివ్వండి. ఎవళ్ళో ఒకళ్ళు తగ్గాలిగా'

'అదే విధంగా మీరు అనుకుని ఉంటే ఇంతదాకా ఎందుకు వచ్చి ఉండే దంటాను ?'

'నన్ను ఇరకాటంలో పెడుతున్నారు. . .'

'అంటారా'

'సుశీలకంటె మీరు చదువుకున్నవారు. అన్ని విధాలా అర్థం చేసుకోగల వారు మీరే ఇట్లాచేస్తే. . . .'

శ్యామసుందర్‌కు సమాధానం చెప్పాలో అక్కర్లేదో, చెబితే ఏం చెప్పాలో తోచలేదు. సమాధానం చెప్పక పోవటం అదనుగా తీసుకుని సుమిత్ర మళ్ళీ చెప్పటం మొదలెట్టింది.

'ఒక వేళ సుశీల అట్లా అన్న దనుకోండి. మీరు కూడా వాదంలోకి దిగటం దేనికి చెప్పండి ?'

శ్యామసుందర్‌కు ఆపుచేదామనిపించింది. వాదం మొద లెట్టిందీ, పెరచిందీ సుశీలేనని గట్టిగా చెబుదా మనిపించింది. మరీ మితిమీరి పోతున్నప్పుడే తను అడ్డువచ్చాననీ, అప్పుడు గనక ఇంక ఆపు చెయ్యకపోతే పరువు అనేది ఉండదనే గట్టిగా నొక్కి చెబుదా మనిపించింది. కాని సుమిత్ర చెప్పనిస్తేనా ?. . . .

. . . . రమాకాంత్ ఒక్కసారి ఆ గడియారం వైపు చూశాడు. రెండవ ఆట సినిమా 'ఇంటర్‌వెల్' అయిఉండచ్చు. రమరాలేదే ? వచ్చిందా లేకపోతే ? వచ్చి తనను డిస్టర్బ్ చెయ్య టం ఇష్టంలేక లోపలకు వెళ్ళి పడుకుందేమో ?

రాస్తూన్న కథ ఆపుజేసి లోపలికి వెళ్ళాడు రమాకాంత్. రమలేదు ! అవాళ 'ఆఫ్'— తనకు— డ్యూటీ లేదు. ఆ సంగతి రమకు తెలుసు. అయినా సినిమాకు వెళ్ళింది. పోనీ ఉమ వచ్చింది. కాబట్టి వెళ్ళింది. బాగానే ఉంది. 'ఫస్ట్‌షో' కాగానే వచ్చెయ్య చ్చునుగా? మళ్ళువారందాకా తనకు తీరికదొరకదు—డ్యూటీ, నిద్రా, చిల్లర పనులూ తప్ప.

బాగా ఆలస్యం అయిపోయిందని ఉమా వాళ్లింట్లో ఉండి పోయిందేమో ? అయినా బయలుదేరి వెళ్లేటప్పుడు తెలుసునుగా ఆలస్యం అవుతుందని ? టాక్సీలో వచ్చెయ్యొచ్చు నుగా ? ఎక్కడ నుంచైనా 'రింగప్' చెయ్యచ్చునుగా, ఇబ్బంది అయితే ? రమ చదువుకోనిది కాదే ? ఇటువంటి భయాలేవీ లేవే ? పల్లెటూరు నుంచి సొంత బండిలో వచ్చి రాత్రి రెండా టలూ చూసి బండిలో నిద్రపోయి, పొద్దున్న బండి తోలుకు పోయేవాళ్ళ లాగ, ఏకంగా ఇద్దరూ రెండో ఆట కూడా చూడ టానికి వెళ్లారేమో ? ఏమైనా తనకు చెప్పచ్చునుగా ? రమ చేస్తూన్న పనిని తను ఎప్పుడు వద్దన్నాడని ?

బయలుదేరి వెడితేనో ? ఎక్కడకు బయలుదేరి వెళ్ళ డం ? ఉమ ఇంటికి !

కాస్సేపాగితే బాగుండుననిపించింది. కాదు ఉన్నపళంగా బయలుదేరి వెడితేనే మంచిదనిపించింది. అక్కడ వాళ్లిద్దరూ తనను చూసి ఆశ్చర్య పడచ్చు. బాగుంటుంది కూడాను, వాళ్ళట్లా ఆశ్చర్యపడటం ? అప్పుడు నిజంగా రమకు తను చేసిన పనేమీ

బాగోలేదనిపించచ్చు. ఉమ కూడా ఏమీ అనడానికి వీలుండదు కూడాను.

రమాకాంత్‌కు ఏమి చెయ్యాలో తోచలేదు. ఉమ ఇంట్లో ఒక రాత్రి ఉంటే యేం అని అనుకుని ఉండచ్చు రమ. నిజానికి తప్పేమిటి స్నేహితురాలి దగ్గర ఉండటంలో ? రమాకాంత్ అనే వాడు పెళ్ళయిన కొత్తలో— 'మీ వాళ్ళ నుంచి నిన్ను తీసుకు వచ్చేసాననుకునేవు ? నిర్భయంగా, నిశ్చింతగా వెళ్ళిరా ఎప్పుడు బడితే అప్పుడు ? ఎన్ని రోజులు కావలిస్తే అన్ని రోజులు ఉండు ? అని. అంటున్నారుగాని నిజంగా మీరు వెళ్ళనిస్తారా' అన్న రమ మాటలు జ్ఞాపకానికి వచ్చాయి రమాకాంత్‌కు.

రమను తను ఎప్పుడూ కావాలని దూరం చెయ్యలేదు. రానురాను ఇంకా దగ్గరకు వస్తోందనుకున్నాడు. తనకు తెలిసి నంత మటుకూ రమకు కష్టం కలిగించే మాటలు అనటం గాని, అటువంటి పనులు చెయ్యటం గాని ఎన్నడూ జరగలేదు. పనిలో మునిగి ఆవిడతో సినిమాలకు వెళ్ళి ఉండక పోవచ్చు. సరదాగా స్నేహితుల ఇంటికి తీసుకు వెళ్ళి ఉండక పోవచ్చు. అంత మాత్రం చేత తనను నిర్లక్ష్యంగా చూస్తున్నట్లు భావిస్తే ఎట్లా ?

ఆ మధ్య ఇద్దరు మిత్రులు స్త్రీని గాలితోనూ, నీటితోనూ పోల్చారు. పోల్చటంతో ఆగకుండా దాన్ని సాగదీసి, అభిప్రాయ భేదాలొచ్చి, రమాకాంత్ దగ్గర కొచ్చారు. ఒక మిత్రుడిపేరు రామారావు. మరొకతని పేరు వెంకట్రావు. ఇద్దరూ కాల్ టెక్స్‌లోనే పని చేస్తున్నారు. వాళ్ళ వాదం ఇది. రామారావూ వెంకట్రావూ కేన్‌టీన్‌లో కాఫీ తాగుతూ ఉండగా చాలా ఒరిజినల్‌గా ఇద్దరికీ ఐడియాలొచ్చాయి.

'స్త్రీని గూర్చి నీ అభిప్రాయ మేమిటోయ్' అన్నాడు పోజులో రామారావు.

'స్త్రీ వట్టి గాలి పదార్థమోయ్' అన్నాడు వెంకట్రావు.

'కాదు వట్టి నీరు— అంటే ద్రవపదార్థమోయ్' అని ఖండించాడు రామారావు.

వీళ్ళిద్దరూ దెబ్బలాడుకున్నంత పని చేసి అప్పుడు డ్యూటీ అయిపోయి కాన్‌టీన్‌లోకి వచ్చిన రమాకాంత్‌ని పట్టుకుని 'నువ్వేమంటావు' అన్నాడు రామారావు కాబూలీ వాడు నడిబజార్లో బాకీ వసూలు చెయ్యడానికి కాలర్ పుచ్చు న్నట్లుగా.

అభిప్రాయం చెప్పటం తప్పక పోయేసరికి ఇద్దరినీ సాగదీసి అడిగాడు 'రుజువు చెయ్యండోయ్' అని. 'నువ్వు చెప్పు' అన్నట్లు చూశాడు రామారావు, వెంకట్రావు వైపు.

వెంకట్రావు అన్నాడుగదా— 'గాలిలేని చోటు లేనట్లే స్త్రీ లేని చోటు లేదు లోకంలో. బీడీల ఎడ్వర్టయిజామెంటు దగ్గరనుంచి సినిమా పోష్టరుదాకా ప్రతి దానిమీద అందమైన అర్ధనగ్నమైన స్త్రీమూర్తి లేకుండా ఉండదు కదా?'

'బాగుంది' అన్నట్లు తలవూపాడు రమాకాంత్.

రామారావు ఏమన్నాడంటే— 'నీరు ఏ రకంగా పల్లానికి పారుతుందో స్త్రీ బుద్ధి డబ్బువైపు, తద్వారా వచ్చే సౌకర్యాల వైపు మళ్ళుతుంది.'

ఒక నవ్వు నవ్వేసి, ఇద్దరి భుజాలు తట్టేసి, ఇద్దరూ గెలిచారనీ, అంటే 'మ్యాచ్' 'డ్రా' అయిందని డిక్లేర్ చేసి వచ్చాడు.

ఆ సంఘటన జ్ఞాపకం వచ్చి నవ్వొచ్చింది. ఈ సమయంలో గుర్తుకు వచ్చినందుకు మరీ మరీ నవ్వొచ్చింది.

మళ్లీ కూర్చుని కథపూర్తి చేస్తేనే బాగుండేలాగుంది. ఈ సమస్య ఇప్పుడు తేరేదా ఏమన్నానా? రేపటినుంచీ.... రేపంటే ఎంత? తెల్లవారితే డ్యూటీ తయారు. ఎనిమిది గంటల నిలువు జీతం ఇంచుమించు.

రమాకాంత్‌కు రాస్తున్న టేబుల్ పైన ఎదురుగా ఫ్రేంలో పెట్టిన ఫోటో కనిపించింది. అందులోనుంచి చిరునవ్వు విసురుతూన్న రమ కనిపిస్తోంది. ఆ ఫోటో తీసిన రోజు జ్ఞాపకం వచ్చి ఒక్కసారి ఏదో అనిపించింది. అవాళ సాయంత్రం కొత్తగా కొన్న కేమెరాతో రమని ఫోటో తీశాడు. కెమేరాకోసం పోజు ఇమ్మంటే ఇటూఅటూ తిరిగి రమా కాంత్‌ని నానా అవస్థలూ పెట్టింది. ఇవన్నీ కరిగిపోయేటట్లు ఒక్కసారి నవ్వింది. 'క్లిక్' మనిపించాడు 'థాంక్స్' అంటూ.

ఎందుకీ విధంగా స్త్రీలు పెళ్ళయిన తర్వాత మారిపోతారో అర్థం కాలేదు రమా కాంత్‌కి. సెలయేటి నురగలాంటి చిరునవ్వు ఒలకబోసి రమాకాంత్‌ని గెలుచుకుంది రమ. చూపుల ఉచ్చులతో అతని మనసును దోచేసింది రమ. జీవిత వనంలో రోజాలూ మల్లెలూ తప్ప బ్రహ్మజెముడులు మొలుస్తాయేమోననే సంగతి తట్టనే లేదు ఎప్పుడూ.

సాధారణంగా ఇంటికి వస్తూనే గబగబా కోటూ అదీ విప్పదీసేసి ఫ్లాస్కులోంచి టీ పోసుకుని తాగేవాడు. తర్వాతే ఏమైనా మాట్లాడటం. ఎనిమిది గంటలు ఇంచుమించునిల్చుని బస్సులో కునికి పాట్లు పడుతూ ఇంటికి వచ్చేసరికి వంటిలో ప్రతి భాగమూ చిలక్కొయకు తగిలించినట్లుండేది. ఈ సంగతులన్నీ రమకు తెలియడానికి ఎక్కువ కాలం పట్టలేదు. అందువల్లనే టీ తాగేదాకా పలకరించేది కాదు. తరవాత చాలా సరదాగా గడిపేవాడు కాస్సేపు. భోజనం అదీ చేసిన తర్వాత రాసుకుంటూనో

చదువుకుంటూనో కూర్చునే వాడు చాలా రాత్రిదాకా. నైట్ డ్యూటీ ఉన్న రోజుల్లోనైనా రాయటం, చదవటం తప్పేదికాదు.

కాని ఈ పరిస్థితి మారటానికి ఎక్కువ కాలం పట్టలేదు. కొంతకాలం అయ్యే సరికి రమ రమాకాంత్ జీవితాన్ని పూర్తిగా ఆక్రమించింది. డ్యూటీ చేసి వచ్చి, ఇద్దరూ సరదాగా షికారు వెళ్ళి వచ్చే సరికి విశ్రాంతి తీసుకోవడానికి తప్ప మరి దేనికీ సమయం ఉండేది కాదు. ఇట్లా కొన్ని నెలలు గడిచే సరికి తనలో మార్పు వచ్చినట్లు తెలుసుకున్నాడు రమాకాంత్. ఒకప్పుడు ఎంతో నిష్ఠగా చెయ్య దల్చుకున్న పని పూర్తి చేసుకునే రమాకాంత్‌కు డ్యూటీ, రమతో షికారు తప్ప రచనా వ్యాసంగం అంతా మూల పడింది. ఆ తాలూకు మిత్రులు దూరమౌతూ వచ్చారు. కొత్తవి రాయక పోవటంతో సాహిత్య సమావేశాలకి వెళ్ళటంగాని పత్రికలకు పంపటం గాని మానేశాడు. ఒక్క ఏడాది తిరక్కుండానే రమా కాంత్ కేవలం ఒక ఉద్యోగిగా, రమకు అనుకూలమైన భర్తగా మారి పోయాడు.

ఆదివారంనాడు మధు యూనివర్సిటీలో ఏదో సాహిత్య సమావేశం ఉందంటూ వచ్చాడు. మధు రమాకాంత్ ఇద్దరూ కలిసి నాలుగైదేళ్ళబట్టీ సాహిత్య సభలకు వెడుతున్నారు. ఒకళ్ళకొకళ్ళు ఉత్సాహాన్ని ఇచ్చుకుంటూ ఎంతో ముందుకు వెళ్ళారు. ఇద్దర్లో ఏ ఒక్కరు కొత్త కథ వ్రాసినా రెండోవాళ్ళకు చదివి వినిపించకుండా ఉండేవారు కారు. అప్పుడు మధుకు ఓ పెళ్ళి సంబంధం వస్తే కొంతకాలందాకా చేసుకోనని వాయిదావేశాడు. రమాకాంత్ పెళ్ళి తర్వాత జరిగింది.

రమాకాంత్ పెళ్ళి జరిగిన తర్వాత, ఇద్దరి స్నేహానికీ ఒక మాదిరిగా అంతరాయం కలిగింది. దీన్ని చాలా సహజంగా తీసుకోలేకపోయాడు మధు. చేసేది మాత్రం ఏముంది గనక?

ఆ ఆదివారం ఉదయం ఎనిమిదిన్నర అయినా రమాకాంత్ లేవలేదు. ప్రొద్దున్నే వచ్చిన మధుకి రమ కాఫీ ఇచ్చింది. కాఫీ తాగి మధు రమను అడిగాడు "ఇంకా నిద్ర లేవలేదనుకుంటా'అని.

రమ జవాబు చెప్పలేదు.

'అలస్యంగా పడుకున్నాడనుకుంటా'

దీనికీ సమాధానం చెప్పలేదు రమ.

ఈ లోపుగా నైట్‌పైజామాతో డ్రాయింగ్ రూంలోకి వచ్చేశాడు 'ఏమోయ్ మధూ' అంటూ.

'మర్చి పోయా, ఇవాళ సమావేశం ఉంది కదూ యూనివర్సిటీలో? ఏమీ రాయలేదోయ్ కొత్తది, ఎట్లా రావడం?'

మధు అక్కడినుంచి వెళ్లి పోయాడు. రమాకాంత్‌కు ఏదో అనిపించింది. రమకు అర్థం కాలేదు అవవలసినంతగా.

ఇది జరిగినప్పటినుంచీ తను కేవలం సంసారిగా స్థిరపడి పోతున్నాననే విషయాన్ని తెలుసుకున్నాడు రమాకాంత్. సంఘర్షణ చెలరేగింది. తను చేస్తున్న పనిలో ఎంత వరకుసబబు ఉంది? దేనికోసం దేన్ని వదిలెయ్యాలి? వదిలెయ్యచ్చు? వదలాలి! దేనిని?

మధు స్నేహంతోపాటు చాలా వాట్లను వదులుకున్నట్లు తెలుసుకున్న రమాకాంత్ నిజంగా సిగ్గు పడ్డాడు.

ఆ నాటి రాత్రి రమాకాంత్ ఎట్లాగో ఉండటంచూసిన రమ గుచ్చి గుచ్చి అడిగింది.

'అట్లా ఉన్నారేం?'

'ఏం లేదు?

'ఏమీ ఎందుకు లేదు?'

ప్రశ్నపై ప్రశ్న కురిపించింది గాని సమాధానంలో విషయాన్ని రాబట్టలేక పోయింది.

రమాకాంత్‌కు ఒక్కసారి పాతజీవితంలోకి వెళ్ళిపోదామనిపించింది. కొత్తగా సుఖాన్నిచ్చే వసతులు కొన్నిటిని జీవితం కలిగించింది. కాని వాట్లతోబాటు తనలోని ఏదో ఒక చైతన్య లక్షణాన్ని బలంగా లాగేసింది. దీన్ని వెంటనే తెలుసుకోలేక పోయినా రాను రాను ఈ విషయం తనకు తెలిసొస్తూనే ఉంది.

ఎందుకో ఈ సంగతులన్నీ గుర్తుకు వచ్చి మరీ మరీ బాధించాయి రమాకాంత్‌ని.

గబగబా గదిలోకి వచ్చి పూర్తికావలిసిన కథవైపు చూశాడు.

....అంతా విని 'తప్పంతా నాదేనంటారు ఇంతకీ' అన్నాడు శ్యామసుందర్. అతని గొంతు బాధతో జీరవోయింది. అతను ఎంతో ఉత్సాహంతో సుమిత్ర ఇంటికి వచ్చాడు. సుమిత్ర తన గోడు విని సుశీలకు నచ్చ చెప్తుతుందని అనుకున్నాడు గాని ఈ విధంగా మళ్ళా తనకే నీతులు చెబుతుందనుకోలేదు. ఎట్లాగైనా సుమిత్రకు స్నేహితురాలిమీద ఉండే అభిమానం, స్నేహితురాలి భర్తమీద కూడా ఉంటుందనుకోవడం సరియైనదికాదు. ఉండక్కర్లేదు కూడాను. అట్టే మాట్లాడితే సుశీల వాదమే సరియైనదని అనచ్చుకూడాను.

'మీరిద్దరు కలిసి ఉండటమే ఎవరైనా కోరుకునేది మీకు జ్ఞాపకం ఉందో లేదో, శ్యామసుందర్, మీ ప్రణయ గాథ.....'

'ఇప్పుడెందుకులేండి?'

'అంత తేలికగా మీరు మర్చి పోగలగచ్చు. ఇప్పుడు మీకు రుచించదు గనక వీలుగా మమ్మల్నందర్నీమర్చి పొమ్మని చెప్పచ్చు. కాని మేమెవ్వరమూ మర్చిపోలేం.'

శ్యామసుందర్ గట్టిగా సమాధానం చెప్పవలసిన అవసరం కలిగింది. ఒక్క సమాధానం చెప్పడమే కాదు ఏదో ఒక నిర్ణయానికి వచ్చి తీరవలసిన క్షణం అది.

జీవితం కట్టుకథ కాదు, చెప్పినట్టు వినటానికి. రాసేసిన నాటకంలోని డైలాగులు కావు వాళ్ళు మాట్లాడేవి. చర్చించవలసిన విషయాలకి ముందర సంతృప్తికరమైన సమాధానాలు తయారు చేసుకునే అవకాశం ఇచ్చే 'గోష్టి' కాదు వాళ్ళిద్దరి సంభాషణ.

సుశీలకూ శ్యామసుందర్‌కూ మధ్య కొద్ది రోజులబట్టి విపరీతంగా మనస్పర్ధలు పెరుగుతూ వచ్చాయి. ఆ విషయం సుమిత్రకు తెలుసు. అసలు సుమిత్రే కారణం ఒకరకంగా వాళ్ళిద్దరి ప్రేమా వివాహంగా మారటానికి. సుశీల శ్యామసుందర్ ఒకరినొకరు పూర్తిగా అర్ధం చేసుకుని ఒకళ్ళు లేకపోతే ఒకరు ఉండలేమనే స్థితికి రాగానే, వాళ్ళు వివాహబంధంలోకిరావటానికి లెక్కలేనన్ని ఆటంకాలు వచ్చాయి. వాట్లన్నిటినీ ఒక్కొక్కటే తొలగించే ప్రయత్నం చేస్తూన్నప్పుడు అనిపించేది ఒక్కొక్కసారి సుమిత్రకు— 'నా జీవితంలో రాబోయే చిక్కుల్ని ఎవరు విడదీస్తారు?' అని.

వద్దనుకున్నా ప్రణయ కథనంతో జ్ఞాపకం చేసింది సుమిత్ర.

'ఒక్కసారి మీ నిర్ణయాలన్నీ మార్చేసుకుని, మీ మాటని మీరే వినమంటే......'

'మీతో నేను ఇప్పుడేమీ చెప్ప దలుచుకో లేదు'

'కాని అంత తేలికగా తేలిపోదనుకుంటాను ఈ విషయం?'

'మీరు బెదరించినటు మాట్లాడితే నేనేం చెయ్యలేను, సమస్యనీ, మిమ్మల్నీ విడచి నా దోవన నేను వెళ్ళి పోవటం తప్ప,

'బెదరింపంటే ఇదే'

నవ్వగా నవ్వింది సుమిత్ర. ఎందుకో ఏమో ఒక్కసారి మనస్సు చలించింది సుందర్‌కు. సుమిత్రే తన జీవితాన్ని పంచుకుని ఉన్నట్లయితే...... అసలు సుమిత్రకు కూడా ఇదే విధమైన ఆలోచన వచ్చిఉంటే? రాలేదని ఎలా చెప్పటం?

మొట్ట మొదటి సారిగా బెదురు చూపులు చూశాడు సుందర్. మొట్టమొదటి సారిగా సుమిత్ర మాట తడబడింది.

'మీరు.....'

'ఆ...... అవును.....'

తార్కికంగా విషయాల్ని తేల్చుకుందామనీ పరిస్థితుల్ని మారుద్దామనీ అనుకున్నవాళ్ళు ఆ క్షణంలో తబ్బిబ్బయ్యారు.

సుశీల ప్రేమ కథా రచనలో తన భాగాన్ని తాను మర్చిపోయే ముందే తనకు తెలియకుండా తనను చుట్టుకున్న ఏదో భావాన్ని వదల్చుకోవాలనిపించింది. ఈ సంగతి తెలుసుకునే సరికి సుమిత్రకు తన చేతుల్లోంచి ఏదో జారి పోతోందేమోననే భావనా, అది సంఘర్షణాస్వరూపాన్ని ధాల్చవచ్చుననే భయమూ కలిగాయి.

'సుశీలకూ మీకూ ఎప్పటినుంచి స్నేహం?'

'మీకన్నా ముందర్నుంచే'

'క్షమించండి, ఈ విధంగా ప్రశ్నించినందుకు'

'నవ్వొస్తోంది నిజంగా. మనం ఒక సమస్యను తేలుదామని బయలుదేరి......మరో సమస్యలో చిక్కుకున్నామేమో?'

తలుపు చప్పుడైంది ఇంతలో.

'నేను తలుపు తీసి వస్తానులెండి. కాని నేను చెప్పే మాటను కాదనకండేం?'

'మీరు చెప్పేది.....'

'మీరు అర్థం చేసుకోగలరనే విశ్వాసం నాకు ఉంది.'

మళ్ళా తలుపు చప్పుడైంది. సుశీ..!

సుందర్‌ను చూసీ చూడనట్లుగానే లోపలికి వెళ్ళిపోయింది సుశీల. లోపలకు వెళ్ళింది సుమిత్ర కూడా. మరో అయిదు నిమిషాల తర్వాత గాని ఇద్దరూ బయటికి రాలేదు.

సుశీల సుమిత్రని అనుకుని కూర్చుంది. తల క్రిందికి దించింది. సుందర్ గనక కళ్ళల్లోకి సూటిగా చూస్తే అతనికి లొంగిపోతానేమోననే భయంతోనేమో అన్నట్లు తలదించుకుంది సుశీల.

'పూర్వకాలపు కొత్త పెళ్ళి కూతురులాగ ఏమిటా తల వంచుకు కూర్చోవటం?'

'ఏమి చమత్కారం?' అనుకున్నాడు తనలో సుందర్.

'ఎంత గడుసుది సుమిత్ర నిజంగా' అనుకుంది సుశీల.

'కొత్త పెళ్ళికూతురేమిటి, పేపరు కాగితంలాగ?' అంది సుశీల, మాట అందుకుని.

అందరూ నవ్వేశారు.

'మనం యూనివర్సిటీ దగ్గర సముద్రపు ఒడ్డుకో, 'లాసన్స్‌బే' దగ్గరకో పోదాం, బజార్లో కాస్త కాఫీ తీసుకుని, అంది సుమిత్ర.

సుందర్, సుశీల మౌనంగా ఊరుకున్నారు.

'అయితే టాక్సీని పిలుస్తానుమరి'

దీనికి కూడా ఇద్దరు కిమ్మనలేదు.

సుమిత్ర టాక్సీని పిలిచింది. ముగ్గురూ సరిగ్గా యూనివర్సిటీ దగ్గర దిగారు. ఇసుకలో దిగబడుతూ, అడుగులు తడ

బడుతూ నడుస్తున్నారు. ఒక గుట్టమీద కూర్చున్నారు. కెరటాలు ఏ క్షణంలోనైనా వాళ్ళను తడిపెయ్యచ్చును. వాళ్ళకక్కడి నుంచి కదలబుద్ధి పుట్టలేదు. ఓ కెరటం వచ్చి సుమిత్రను తడిపేసినంత పని చేసింది.

'నాకు ప్రమాదం వచ్చినా పర్వాలేదు. దిగులు పడేవాళ్ళెవరున్నారు గనక నాకోసం?' అంది సుమిత్ర. అనటం అయితే నవ్వుతూనే అన్నది గాని అంత తేలికగా ఆ మాటల్ని అనలేదనేది ఆ మాటల్నిబట్టే తెలుస్తోంది.

'అరెరె, మీరు బాగా తడిసిపోయినట్లున్నారే?'

'అదేమిటి సుమిత్రా, చీర అలా తడుస్తూ ఉంటే చూస్తూ ఊరుకున్నావు?'

'ఏం చెయ్యమంటావు మరి?'

సుమిత్ర నిస్సహాయతను వెలిబుచ్చడం విన్న సుశీలకు ఏమి మాట్లాడాలో తోచలేదు. సుందర్, సుమిత్ర ఒకళ్ళవైపు ఒకళ్ళు చూసుకున్నారు.

'మీ ఇద్దర్నీ ఒక చోటకు తీసుకొచ్చి నేను పక్కకు తప్పుకుందామనుకుంటే.....'

' .... ఆగారేం, చెప్పండి' అన్నాడు సుందర్.

అర్థం కానట్లుగా చూసింది సుశీల.

'ఒక దగ్గర కూర్చుంటే దగ్గరకు వచ్చినట్లేనా ఏమిటి?, అన్న సుశీల మాట అందుకుని సుందర్ అన్నాడు.

'దూరంగా ఉన్నంత మాత్రాన దూరంగా ఉంటారు మనుషులంటే మాత్రం దేనికి నమ్మటం?'

ఈ రకంగా సాంకేతికంగా మాట్లాడుకోవడం ఉబుసుపోకకు, కొత్తగా కథలు రాసేవాళ్ళ సంభాషణలకు బాగుంటుందేమోగాని ఏ సమస్యనైనా పరిష్కరించడానికి మాత్రం కాదు!

'అయితే నేనేగా పరాయిదాన్ని ఇంతకీ' అన్నది సుమిత్ర.

సుమిత్ర అన్న మాటలు సుశీలని ఆశ్చర్యంలో ముంచెత్తాయి. అసలు నిజానికి అంత ఆశ్చర్యంలో ముంచెత్తవలసింది ఏముందని ఆ మాటల్లో? సుశీల మొదటిసారిగా తను చిక్కులో పడ్డట్టు తెలుసుకుంది. తనకూ, సుందర్‌కూ మధ్యన వచ్చిన చిన్న చిన్న తగాదాలు పెద్దవై తుఫానుగా మారే సూచనలు కనిపించే సరికి సుమిత్ర ఓ మాదిరిగాఅడ్డొచ్చింది. సుందర్‌తో మాటామాటా వచ్చి ఇల్లు విడిచి వచ్చేసి స్నేహితురాలికి అంతా వెళ్ళబోసుకుంది. అంత అప్యాయంగా తన మనస్సులోని బాధనంతా వెళ్ళగక్కుకోవడానికి మరెవ్వరూ లేరు కూడాను.

సుశీల కొంచెం తొందర పడే స్వభావం కలదని సుమిత్రకు తెలుసు. ఇందులో ఏ ఒక్కరిదో మాత్రమే పూర్తిగా తప్పని ఎప్పుడూ అనుకోలేదు సుమిత్ర. కాని సుశీలే తొందర పడిఉంటుందనీ, సుందర్‌ను బాధపెట్టి వచ్చేసిందన్న నిర్ణయానికి వచ్చింది సుమిత్ర. కాని సుందర్‌కు ఏ విధంగానైనా నచ్చజెప్పాలని ఇద్దరి మధ్యనున్న అంతరాల్ని తొలగిద్దామనీ ప్రయత్నం.

సుమిత్ర అన్న మాటలు సుశీలను చాలా సేపటిదాకా కలవరపరచాయి. మునపటిదాకా రాని ఆలోచనన్నీ వచ్చాయి సుశీల మనస్సులోకి. సుమిత్ర ఈ విధంగా మాట్లాడుతుందని ఎప్పుడూ అనుకోలేదు. అంతకు ముందుదాకా ఏమన్నా సోదరస్యత ఏర్పడుతూ ఉందేమో గాని ఆ క్షణంతో ఆ ఆశలుగూడా కొట్టుకు పోయాయి.

మాట్లాడుతూ మాట్లాడుతూన్న వాళ్ళు ఆగిపోవడంతో ఆ సముద్రపు ఒడ్డు ఒట్టి దిబ్బలాగ కనిపించింది ఆ క్షణంలో.

...... రమాకాంత్ కోసమూ, రమాకాంత్ రాస్తూన్న కథ కోసమూ ఆగని సమయం మరో రెండు గంటలకు తెల్లవారుతుందని చెప్పింది. ఎంత ఆపినా ఆగకుండా నిద్దర కూరుకు వచ్చింది. ఆ కాగితాల్నిచెల్లా చెదరుగా వదిలేసి పిచ్చి నిద్ర పోయాడు రమాకాంత్.

ప్రొద్దున్న లేచేసరికి ఎనిమిదైంది.

పనిచేసే మనిషి కాఫీ పట్టుకొచ్చి ఇచ్చింది. 'ఉహు? అమ్మగారు ఇంకా లేవలేదట్టుంది' అని విసుక్కుని కాఫీతాగి, ఆత్రుతతో కథ పూర్తి చెయ్యటం మొదలెట్టాడు. ఈ కథ రాబోయే సమావేశంలో చదవాలి, దీనిలో ఉన్న సంఘర్షణ దీన్ని ఇంత బలంగా తయారు చేసింది. భావాలకి జీవం పోసింది.

..... సుమిత్ర అక్కడనుంచి మెల్లగా లేచి వెళ్ళి పోయింది. ఇద్దరూ చూస్తూ ఉండి పోయారు. సుశీలగాని సుందర్ గాని సుమిత్రను ఆపు చెయ్యడానికి ప్రయత్నించ లేదు.

ఇద్దరూ ఎంతసేపు సముద్రపు భాష వింటూ కూర్చున్నారోగాని ఇద్దరూ టాక్సీ తీసుకుని ఇంటికి వచ్చే సరికి రాత్రిలో ఎక్కువ భాగం మిగల్లేదు!

...... 'అబ్బ. ఎంత బాగుంది కథకి ముగింపు,' అనుకున్నాడు రమాకాంత్.

'ఎన్నిరోజులకి మంచి కథ రాశాను? నాలో సంఘర్షణ ఉందిగనకే ఇంతగా చిత్రించగలిగాను వాళ్ళ ముగ్గుర్నీను' అనుకున్నాడు రమాకాంత్. మళ్ళీ ఒక్కసారి పెళ్ళి కాకముందు తను గడిపిన జీవితం, మిత్రులతో జరిపిన చర్చలూ స్మృతిపథంలో తిరిగాయి. వాటిని నెమరు వేసుకుంటూ ఉంటే కాస్త మత్తెక్కినట్లయింది.

ఏదో దొరికిన వాడి మాదిరిగా గబగబా పరుగెత్తుకునిమధు దగ్గరకు వెడదామనిపించింది. ఆ తృప్తి అల్లాంటిది! తల్లి,

పొత్తి గుడ్డల్లోని పిల్లాడిని చూసి మురిసి పోయి, పడ్డ యాతన నంతా మర్చి పోయినట్లు ఇంత సంఘర్షణతో కొట్టుమి ట్టాడినా తను ఆ సంఘర్షణకు అక్షర రూపమిచ్చానుగదావని మురిసి పోయాడు రమాకాంత్.

కొన్ని నిమిషాల తర్వాత ఈ-లోకంలోకి వచ్చి—

'ఈ ఇంట్లో ఎవరూ లేరా' అని కసురుకున్నాడు పనిచేసే దానిమీద.

'అమ్మగారు మీకీ చీటీ ఇమ్మన్నారు' అని ఒక కాగితం ముక్క ఇచ్చింది పనిచేసేది.

'చీటీ ఇయ్యటమేమిటి. ఇదేమన్నా నాటకమా? కట్టు కథా? ఎక్కడికి వెళ్ళినట్టు?'

మరీ ఆవేశం పెరిగిపోతోంది రమాకాంత్‌కు.

'మరండీ... మరి..మరి...'

' .... చెప్పు, చెప్పేదేమిటో'

'అమ్మగారు, ఉమగారింటికి వెళ్ళి, అడనుంచి అళ్ళమ్మ గారింటికి.....'

'చాలు, చాలు... నువ్వూ మీ అమ్మగారింటికి వెళ్ళు'

'చీటీ చదువుకోమన్నారు. అన్నీ వివరంగా....'

పదహారు ముక్కలుగా చింపేశాడు చీటీ రమాకాంత్!

పని చేసేది బిక్క ముఖం వేసింది, ఏమి చెయ్యాలో తోచక.

'సంఘర్షణకు అక్షరరూపమిచ్చాను' అని తను కాస్సేపటి క్రింద అనుకున్న మాటలు లోలోపల తిరిగాయి కసిగా రమాకాంత్‌లో.

'కిటికీలోంచి గాలివచ్చి కాగితాలన్నిటినీ చిందరవందరగా పారేసింది.

'ఎక్కడికి పోయార్రా, కిటికీ తలుపులన్నా వెయ్యాలని తెలియదు ఈ ఇంట్లో ఎవ్వరికీ' అని విసుక్కున్నాడు.

అప్పటికే రెండు కాగితాలు రెండు దిశల్లో పారిపోతు న్నాయి. రమాకాంత్ అటూఇటూ పరుగెడుతూంటే, పనిచేసే మనిషి 'అవి సిత్తు కాగితాలు బాబూ' అని విసిరి అవతల పారెయ్య బోతుంటే గట్టిగా అరిచాడు రమాకాంత్!

